సాక్షి
కుమురం భీం

బడ్జెట్ సమావేశాల్లో మనోళ్లు

బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అసెంబ్లీకి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరయ్యారు. తొలిసారి గెలిచిన పాల్వాయి హరీశ్‌బాబుకు ఇవే మొదటి సమావేశాలు.





శుక్రవారం ၊ 9 ၊ ఫిబ్రవరి ၊ 2024

న్యూస్‌రీల్

పారదర్శకంగా వైద్యపరీక్షలు



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు పారదర్శకంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 5 నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అభ్యర్థులకు మెడికల్ టెస్టులు ప్రారంభం కాగా.. గురువారం వైద్య పరీక్షల తీరును ఎస్పీ పరిశీలించి అభ్యర్థులతో మాట్లాడారు. జిల్లాలో 265 మంది అభ్యర్థులు కానిస్టేబుళ్లుగా ఎంపికగా కాగా ఇప్పటివరకు 237 మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని తెలిపారు. శుక్రవారం వైద్యపరీక్షలు ముగుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఆర్ఐ కిరణ్ పాల్గొన్నారు.

11న గురుకుల ప్రవేశ పరీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌రూరల్: గురుకుల పాఠశాలల్లో 2024– 25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 11న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ప్రవేశపరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన, వెనుకబడిన తరగతులు, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఆసిఫాబాద్‌లో 5, సిర్పూర్(టి)లో 2, రెబ్బెన మరో కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో స్వరూపారాణి, గిరిజన సంక్షేమ గురుకులాల ఆర్సీవో గంగాధర్, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో వందశాతం పన్నులు వసూలు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం బిల్ కలెక్టర్లు, సూపర్‌వైజర్లు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పురపాలిక సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆస్తిపన్ను, ఇతర పన్నుల బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. పట్టణ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి సమస్యలు ఎదురు కాకుండా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తగ్గిన ఓటర్లు

ఆసిఫాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం– 2024లో భాగంగా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. జిల్లాలోని 597 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 4,55,437 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. వీరిలో 2,26,994 మంది పురుషులు, 2,28,415 మంది మహిళలు ఉన్నారు. మార్పులు చేర్పులతో గత నెలతో పోలిస్తే 162 మంది ఓటర్లు తగ్గారు. గత నెల 7న ప్రకటించిన ఓటరు తుది జాబితాలో 4,55,599 మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా ప్రకారం జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఓటర్ల తుది జాబితా ప్రకారం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,26,582 మంది ఉండగా, 1,12,510 మంది పురుషులు, 1,14,056 మహిళలు, 16 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అలాగే సిర్పూర్ నియోజకవర్గంలో 2,28,855 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,14,484 మంది పురుషులు, 1,14,359 మంది స్త్రీలు, 12 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. సర్వీసు ఓటర్లు 404 మంది ఉండగా ఇందులో సభ్యులు 398 మంది, స్పౌసెస్ ఆరుగురు ఉన్నారు. 8 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉండగా, వీరిలో 7గురు పురుషులు, ఒక మహిళ ఉన్నారు.



నాగోబా విగ్రహం



దర్బార్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాల్స్

నైవేద్యాల వద్ద వెలిగించిన దీపాలు

జనజాతర పిలుస్తోంది!

- నేటి నుంచి నాగోబా జాతర
- 'మెస్రం' మహాపూజతో షురూ..
- ఇప్పటికే చేరుకున్న వంశీయులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 12న ఆలయ ఆవరణలో దర్బార్
- హాజరు కానున్న రాష్ట్ర మంత్రులు

ఇంద్రవెల్లి: 'గిరి'జన జాతరకు వేళయింది. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం ముస్తాబైంది. ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబాకు అంగరంగ వైభవంగా మహాపూజ నిర్వహించేందుకు మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 10.30 గంటలకు పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకిస్తారు. అనంతరం మహాపూజతో జాతర ప్రారంభమవుతుంది. అధికారికంగా నిర్వహించే ఈ జాతర ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనుంది. మహాపూజకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు హాజరు కానున్నారు. ఈ నెల 12వ తేదీన దర్బార్ నిర్వహించనుండగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారు.

'మెస్రం' సంప్రదాయ పూజలివే..

జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగు నుంచి సేకరించిన పవిత్ర గంగాజలంతోపాటు నాగోబా ప్రతిమలు, పూజసామగ్రితో వచ్చి మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయులు బస చేశారు. శుక్రవారం ఉదయం వీరు కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి వద్దకు డోలు, పెప్రే, కాలికోమ్ వాయిద్యాల మధ్య శోభాయాత్రగా చేరుకుంటారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించనుండగా ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తారు. మహాపూజకు అవసరమయ్యే సిరికొండ నుంచి తీసుకువచ్చిన మట్టి కుండలను 22 కితల మెస్రం వంశం మహిళలకు అందిస్తారు. మెస్రం మహిళలు ఈ సందర్భంగా వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. కొత్త కుండలతో మర్రి చెట్టు వద్ద గల కోనేరు నుంచి పవిత్ర జలం తీసుకువచ్చాక నాగోబా ఆలయం పక్కనే ఉన్న పాత పుట్టను వంశ అల్లుళ్లు తొలగిస్తారు. వంశ మహిళలు, ఆడపడుచులు కొత్త పుట్టలు తయారు చేస్తారు. అనంతరం కొత్త పుట్టల మట్టితో ఉండలు చేసి నాగోబా ఆలయం పక్కనే గల సతి దేవత ఆలయంలో బౌలను తయారు చేస్తారు. ఈ పూజ శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగుతుంది. అనంతరం మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు నాగోబా ఆలయం పక్కనే గల ప్రత్యేక కట్టడం గోవడ్ వద్దకు చేరి కితల వారీగా బస చేయనున్నారు. అక్కడి నుంచే నాగోబా మహాపూజ, సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు.

ఆలయంలో మహాపూజ ఇలా..

సంప్రదాయ పూజలు ముగించాక మెస్రం వంశీయులు పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని హస్తిన మడుగు నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో నాగోబా ఆలయం, విగ్రహానికి అభిషేకం చేస్తారు. రాత్రి 10.30 గంటలకు మహాపూజ ప్రారంభిస్తారు. ఇందులో వంశంలోని పెద్దలు మినహా ఇతరులను అనుమతించరు. మహాపూజ అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులకు మహాపూజ హారతి అందించి ఆహ్వానిస్తారు. మహాపూజతో జాతర ప్రారంభమైనట్లు మెస్రం వంశీయులు ప్రకటిస్తారు.

గోవడ్ ముందు బేతల్ పూజలు

మహాపూజతో పాటు సంప్రదాయ పూజలు ముగించాక మెస్రం వంశీయులు ప్రత్యేక కట్టడమైన గోవడ్ ముందు బేతల్ పూజలు నిర్వహించనున్నారు. ఈ పూజలో ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులు, కొత్తగా బేటింగ్ అయిన కొత్త కోడళ్లు, వంశ మహిళలు కానుకలు అందిస్తారు. అనంతరం వంశం పెద్దలు వెదురు కర్ర పట్టుకుని బేతల్ నృత్యాలు చేస్తారు. బేతల్ నృత్యాలతో నాగోబా పూజలు ముగించి ఉట్నూర్ శ్యామ్‌పూర్ బుడుందేవ్ ఆలయానికి బయల్దేరి వెళ్తారు.



మర్రి చెట్టు వద్ద సంప్రదాయ వంటలు చేస్తున్న మెస్రం వంశ మహిళలు

ముగిసిన తూమ్ పూజలు

పవిత్ర గంగాజలంతో వచ్చి మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు గురువారం తెల్లవారుజాము వరకు మరణించిన 104 మంది పెద్దల పేర్లతో తూమ్ (కర్మకాండ) పూజలు నిర్వహించారు. ఈ పూజల తర్వాత మరణించిన వంశ పెద్దలను నాగోబా సన్నిధికి తీసుకువచ్చినట్లు భావించారు. మర్రిచెట్టు వద్ద 22 కితల వారీగా సంప్రదాయ వంటలు కొనసాగుతున్నాయి.



తూమ్‌పూజలో బియ్యం సేకరిస్తున్న వంశీయులు

పూర్తయిన ఏర్పాట్లు

నాగోబా జాతర నిర్వహణకు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాగోబా దర్శనానికి వచ్చే భక్తులు, నాగోబా సంప్రదాయ పూజలకు వచ్చిన మెస్రం వంశీయుల సౌకర్యార్థం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదుల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కేస్లాపూర్ గ్రామం నుంచి నాగోబా ఆలయం వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జిల్లా అధికారులు అప్పగించిన పనులు పూర్తి చేశారు. దర్బార్ హాల్ పక్కనే ప్రభుత్వ స్టాల్స్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి లోటు రాకుండా చూస్తామని అధికారులు తెలిపారు.

కొత్త కోడళ్లకు బేటింగ్

మహాపూజ అనంతరం రాత్రి ఒంటిగంట తర్వాత గోవడ్ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి చేరుకుని బేటింగ్ (నాగోబా దేవత పరిచయం) ప్రారంభిస్తారు. నాగోబా సన్నిధికి కొత్త కోడళ్లు తెల్లటి దుస్తులు ధరించి వస్తారు. బేటింగ్‌కు వచ్చిన కోడళ్లతో నాగోబా ఆలయం పక్కనే ఉన్న సతి దేవత ఆలయంతో ప్రత్యేక పూజలు చేయిస్తారు. అనంతరం కొత్త కోడళ్లు వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. ఈ ప్రక్రియ అనంతరం కొత్త కోడళ్లు పూర్తిగా తమ వంశంలో చేరినట్లు మెస్రం పెద్దలు భావిస్తారు. ఈ ప్రక్రియ శనివారం తెల్లవారుజాము వరకు కొనసాగుతుంది.

పెర్సపేన్ (పెద్దదేవుడు), బాన్ దేవతలకు పూజలు

మహాపూజ అనంతరం మెస్రం వంశీయులు ఆలయం వెనుక పెర్సపేన్ (పెద్ద దేవుడు), బాన్ దేవతలకు పూజలు నిర్వహించనున్నారు. వంశంలోని పురుషులు పెర్సపేన్ (పెద్ద దేవుడు)కు పూజలు చేసి నైవేద్యం సమర్పించనున్నారు. ఈ పూజల్లో వంశంలోని పురుషులు మాత్రమే పాల్గొంటారు. ఇదే సమయంలో పక్కనే మెస్రం మహిళలు, బేటింగ్ అయిన కొత్త కోడళ్లు బాన్‌దేవతకు పూజలు చేస్తారు. మర్రిచెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి పవిత్ర జలం తీసుకువచ్చి పాత బాన్ దేవతలను తొలగించి కొత్త బాన్ దేవతలను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నైవేద్యం సమర్పిస్తారు. బాన్ దేవత పూజల్లో మెస్రం వంశ మహిళలు, కొత్తగా బేటింగ్ అయిన కోడళ్లు మాత్రమే పాల్గొంటారు.

భారీ బందోబస్తు

నాగోబా జాతర సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 600మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 100కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా పారిశుధ్య పనులు చేపట్టాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగునీటి కాలువలు నిత్యం శుభ్రం చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతీ 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలని సూచించారు. అలసత్వం, నిర్లక్ష్యం వహించకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.



పనులు పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

తెరుచుకున్న బడి తలుపులు



సోయంగూడ పాఠశాలలో విద్యార్థులు, అధికారులు

- 17 మంది పిల్లలతో సోయంగూడ పాఠశాల పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్

వాంకిడి(ఆసిఫాబాద్): ఐదేళ్లుగా మూతపడిన వాంకిడి మండలంలోని సోయంగూడ పాఠశాల తలుపులు మళ్లీ తెరుచున్నాయి. గురువారం విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ మండల విద్యాధికారి మనుకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ నెల 4న 'సాక్షి'లో 'అక్షరం దిద్దని ఆదివాసీ బిడ్డలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు వెంటనే పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎస్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ సోయంగూడలో 17 మంది పిల్లలతో అధికారికంగా పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఖమాన యూపీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న అభిలాష్‌ను ఉపాధ్యాయుడిగా కేటాయించామని వెల్లడించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి.. పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని కోరారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పాఠశాల మళ్లీ మూతపడకుండా చూడటం గ్రామంలోని ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు. సీఆర్పీ విజయ్‌బాబు, ఉపాధ్యాయులు హరీశ్, అభిలాశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'గుండా' గిరి..!

- పడావు భూమిని ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించే యత్నం
- కబ్జాదారుడిని అడ్డుకున్న గ్రామస్తులు
- వాంకిడి మండలం తేజాపూర్‌లో ఘటన
- ఆ స్థలంలో గుడి, బడి ఏర్పాటు చేయాలని స్థానికుల నిర్ణయం

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పట్టణానికి కూతవేటు దూరంలో ఉంటుందా ఆ ఏజెన్సీ గ్రామం. గ్రామానికి ఆనుకుని ఉన్న 2 ఎకరాల 8 గుంటల స్థలాన్ని గ్రామ అవసరాల కోసం ఆ గ్రామస్తులు ఖాళీగా ఉంచారు. మూడు తరాలుగా ఆ భూమి గ్రామస్తుల ఆధీనంలోనే ఉంది. రెవెన్యూ రికార్డుల్లోనూ 'పడావు (పనికి రాని బంజరు భూమి)'గా నమోదైంది. ఇప్పుడా స్థలంపై ఆసిఫాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి కన్ను పడింది. రూ.కోట్లు విలువచేసే ఆ భూమిలో ప్లాటు వేసి విక్రయించాలని భావించి.. వెంటనే కార్యాచరణలోకి దిగాడు. ఆ భూమిని చదును చేసి అందులో ప్లాట్లు వేయగా.. గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో రాత్రికిరాత్రే ఆ భూమిని దున్నేశాడు. వాంకిడి మండలం తేజాపూర్ గ్రామంలో జరిగిన ఈ ఘటనపై ఆ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కబ్జా విషయం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ సమగ్ర నివేదికను కోరడంతో రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

గ్రామ అవసరాల కోసం స్థలం..

వాంకిడి మండలం తేజాపూర్ గ్రామంలో 75 కుటుంబాల వరకు నివసిస్తున్నాయి. గ్రామ అవసరాల కోసం సర్వే నంబరు 46లో పూర్వం 2 ఎకరాల 8 గుంటల స్థలాన్ని గ్రామ పెద్దలు ఖాళీగా ఉంచారు. అయితే ఈ స్థలానికి ఆనుకునే సర్వే నం. 107/1/2లో అస్లాం బీన్ సలాం అనే వ్యక్తికి చెందిన భూమి ఉంది. పడావు భూమిని సైతం తేజాపూర్ గ్రామానికి చెందిన ఓమాజీ అనే వ్యక్తి సహకారంతో అస్లాం సాగు చేస్తూ వస్తున్నాడు. ఈ భూములకు సమీపంలోనే ఇటీవల నాలుగు వరుసల రహదారి పనులు పూర్తయ్యాయి. దీంతో ఇక్కడి భూముల విలువ పెరిగింది. ఇటీవల తన భూములను ఆసిఫాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి విక్రయించిన అస్లాం.. పడావు భూమిని సైతం అక్రమంగా అతనికే కట్టబెట్టి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అస్లాంకి చెందిన భూములు కొనుగోలు చేసిన వ్యాపారి తేజాపూర్ గ్రామకంఠ భూమి(పడావు)లో ప్లాటు వేసి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించి కార్యాచరణకు దిగడం గమనార్హం.

రెవెన్యూ అధికారుల హడావుడి..

కబ్జా పర్వంపై కలెక్టర్ హేమంత్ బోర్కడే రెవెన్యూ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా.. అధికారులు హడావుడిగా చర్యలకు దిగారు. వెంటనే గ్రామానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో ఎవరూ చొరబడరాదని హెచ్చరికలు జారీ చేశారు.



తేజాపూర్‌లోని పడావు భూమిలో గ్రామస్తులు

అడ్డుకున్న గ్రామస్తులు..

ఆసిఫాబాద్ వ్యాపారి అక్రమ మార్గంలో ప్లాట్లు వేసి సొమ్ము చేసుకోవడాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అక్రమ పద్ధతిలో గ్రామానికి చెందిన భూమిని కొనుగోలు చేయడమే కాకుండా ఆ భూమిని చదును చేసి ప్లాట్లు వేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామానికి చెందిన పడావు భూమిని సాగు చేసుకుంటూ ఒక్క రూపాయి ఇవ్వకపోయినా పట్టించుకోలేదని.. ఇప్పుడా భూమిని ఇతరులకు అక్రమంగా విక్రయించారని తెలియడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొంటున్నారు. సర్కారు భూమి కబ్జాకు గురైందని తెలిసినా రెవెన్యూ అధికారులు అక్రమార్కులకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తున్నారు. కబ్జా విషయం వెలుగులోకి వస్తుందని భావించిన ఆసిఫాబాద్‌కు చెందిన వ్యాపారి రాత్రికి రాత్రే ఆ భూమిని దున్నేయడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. గతంలో ఉన్న గుడితోపాటు ఓ పాఠశాలను సైతం ఇక్కడ ఏర్పాటు చేయాలని వారు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

కబ్జాను అడ్డుకుంటాం



మూడు తరాలుగా ఆ భూమిని గ్రామ అవసరాల కోసం వినియోగిస్తున్నాం. ఆ భూమిని ఎవరో కబ్జా చేసి ప్లాట్లు వేసి విక్రయిస్తామంటే చూస్తూ ఊరుకోం. అక్రమాలను అడ్డుకుంటాం. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కబ్జా వ్యవహారాన్ని తీసుకెళ్లాం.

– వడే బాపూరావు, గ్రామ పటేల్, తేజాపూర్

గుడిని సైతం కూల్చివేశారు



మా తాత ముత్తాల నుంచి ఈ భూమి గ్రామ అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇక్కడ హోళి వేడుకలు జరుపుకోవడానికి ఓ గుడి సైతం ఉండేది. దానిని కబ్జాదారుడు కూల్చివేశాడు. ప్రస్తుతం ఆ స్థలంలో గుడిని నిర్మించాలని అధికారులను కోరుతున్నాం.

– అదే శంకర్, గ్రామస్తుడు, తేజాపూర్

క్లుప్తంగా

రిటైర్డ్ కార్మికుడు ఆత్మహత్య

రామకృష్ణాపూర్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కొమ్ము ఐలయ్య (62) గురువారం క్యాతనపల్లి రైల్వే గేట్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు మంచిర్యాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. ఏడాదిన్నర క్రితమే పదవీ విరమణ పొందిన ఐలయ్య కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య

లింగాపూర్: వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కొట్టే ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చోర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దేవుగూడకు చెందిన డిగ్రీ విద్యార్థిని సోయం పుష్పలత (19) మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. తమ కూతుర్ని సిడాం పరశురాం అనే యువకుడు వేధించడంతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి సోయం రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పని గంటలు సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్: కార్మికులు పని గంటలను సద్వినియోగం చేసుకుని సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం నాయిని ఉమాకాంత్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో గురువారం మల్టీ డిపార్టుమెంట్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగులు, యంత్రాల పనితీరు గణాంకాలను వివరించారు. కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ బహెర, డీజీఎం(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) రామారావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: 2023–24 విద్యాసంవత్సరంలో ఉత్తమ పాఠశాల సౌకర్యాల పథకం కింద ఎంపిక చేసేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల (ఆంగ్ల మాధ్యమం) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ఉన్నతమైన ప్రాథమిక విద్యను ఆంగ్ల మాధ్యమంలో అందించేందుకు ఆసక్తి గల విద్యాసంస్థలు, హాస్టల్ వసతి, మౌళిక వసతులు కలిగి ఉండాలన్నారు. ఐదేళ్లలో పదోతరగతిలో 90 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండి, 50 శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ (డే స్కాలర్) విద్యార్థులకు రూ.28 వేలు, 5వ తరగతి రెసిడెన్షియల్ (వసతిగృహం) విద్యార్థులకు రూ.42 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 15లోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, ఉపసంచాలకుల కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

అడవిలో ఫైర్‌లైన్స్

- జన్నారం డివిజన్‌లో అగ్గివరుసలు ఏర్పాటు
- అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ ముందస్తు కార్యక్రమాలు
- గ్రామాల్లో ప్రజలకు అవగాహన


అగ్గి వరుసలు చేసి నిప్పు పెడుతున్న కూలీ

జన్నారం: వేసవిలో అడవులకు అగ్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అడవికి నిప్పంటుకుని వన్యప్రాణులు, చెట్లు, పక్షులను ప్రాణహాని జరిగే ప్రమాదం ఉంది. అగ్ని ప్రమాదాల భారి నుంచి అడవులను రక్షించేందుకు అటవీశాఖ అధికారులు ముందస్తు కార్యక్రమాలు చేపట్టారు. కూలీల ద్వారా అడవిలో ఫైర్‌లైన్స్ (అగ్గివరుసలు) ఏర్పాటు చేయిస్తున్నారు. ముందుగా రాలిన ఆకులను పోగుచేసి వాటికి నిప్పుపెడితే అడివంతా రగిలే అవకాశం ఉండదనే ఉద్దేశంతో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు. ఇవి వేసవిలో అడవికి నిప్పు తగలకుండా మంచి ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల, జన్నారం అటవీ డివిజన్‌లలోని బీట్‌లలో ఫైర్‌లైన్ పనులు చేయిస్తున్నారు. ఇందుకోసం కాంపా స్కీం కింద నిధులు కేటాయించి సిబ్బందితో ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే బేస్‌క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు ఆ స్థలానికి వెళ్లి బ్లోయర్‌లతో అగ్గి వ్యాపించకుండా ఆకులను తొలగించి ప్రమాదాలు నివారిస్తున్నారు. అగ్గి వరుసలతో గతేడాది జిల్లాలోని కోర్, బఫర్ ఏరియాల్లో చాలావరకు అగ్నిప్రమాదాలు తగ్గాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఫైర్‌లైన్స్ అంటే?

అడవిలో ఆకులు రాలిపోతాయి. పశువుల కాపరులు, అడవికి వెళ్లిన వారు బీడీ, చుట్ట తాగి అలాగే పడేస్తే ఎండిన ఆకులు అంటుకుని మంటలు అడివంతా వ్యాపిస్తాయి. అలా వ్యాపించకుండా ప్రతీ బీట్‌లోని అటవీ ప్రాంతాల్లో ఎడ్లబండ్లు, కాలినడక తొవ్వలకు ఇరువైపులా ఎండిన ఆకులను ఎయిర్ బ్లోయర్‌ల సాయంతో 5 మీటర్ల వెడల్పులో పోగు చేస్తారు. ఈ తొవ్వలపై వేసి అడవికి అంటకుండా నున్నగా చేసి పోగు చేసిన ఆకులకు నిప్పు అంటిస్తారు. ఆకులు కాలేంత వరకు పర్యవేక్షిస్తారు. ఇలాచేస్తే ప్రమాదవశాత్తు అడవిలో నిప్పంటుకున్నా ఈ దారుల వరకే వ్యాపించి ఆగుతుంది. జన్నారం అటవి డివిజన్‌లో ఈ ఏడాది 40 అటవీ బీట్‌లలోని 117.4 కిలోమీటర్ల దూరం వరకు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

అవగాహన సదస్సులు

శాటిలైట్ ద్వారా ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు అగ్ని ప్రమాదాలు సంభవించే అటవీ సమీప గ్రామాల ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పశువుల కాపరులు అగ్గిపెట్టెలు, బీడీలు, సిగరెట్లు, చుట్టలు అడవిలోకి తీసుకెళ్లకుండా చూస్తున్నారు. పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడం, చెత్త అడవిలో వేసి కాల్చడం వంటివి చేయకుండా అవగాహన కల్పిస్తున్నారు. కొందరు బీడీ ఆకుల కోసం, ఇప్పపువ్వు కోసం చెట్లకు నిప్పు పెట్టే అవకాశం ఉన్నందువల్ల అలాంటివి జరుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

శాటిలైట్ ద్వారా ఫైర్ అలర్ట్

అగ్నిప్రమాదాలు నివారించేందుకు అటవీ శాఖ ఉన్నతాధికారులు టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ ఎస్‌ఎన్‌పీపీ అనే శాటిలైట్ ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ ఆధ్వర్యంలో శాటిలైట్ ద్వారా ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరిగినా సమాచారం చేరవేస్తారు. సంబంధిత అధికారుల ఫోన్లకు మెసేజ్ వస్తుంది. కంపార్టు మెంట్ నంబర్‌తో ఏరియాతో సహా తెలియపరుస్తారు. దీంతో సంబంధిత అధికారులు జీపీఎస్ ద్వారా ఆ ప్రాంతానికి వెళ్లి మంటలు ఆర్పివేస్తారు. అంతే కాకుండా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఏ ప్రాంతాల్లో ఉన్నాయో కూడా ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తారు. దీంతో అధికారులు అప్రమత్తమై ఆ ప్రాంతంలో తగు చర్యలు తీసుకుంటారు.

అప్రమత్తంగా ఉన్నాం



వేసవి వచ్చిందంటే అడవుల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. అందుకే ఎప్పటికప్పుడు సిబ్బందిని అలర్ట్ చేశాం. సమాచారం అందిన వెంటనే సిబ్బందిని అక్కడికి పంపిస్తున్నాం. ఒక్కోసారి రాత్రి సమయంలో కూడా సిబ్బంది భుజాన బ్లోయర్లు వేసుకుని అగ్గి రాజుకోకుండా ఆకులను దూరం చేసి ఫైర్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

– హఫీజొద్దీన్, ఎఫ్‌ఆర్వో, జన్నారం

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


క్రీడాకారులతో ఎంవీఐ వివేకానందరెడ్డి

రామకృష్ణాపూర్(చెన్నూర్): క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని మంచిర్యాల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి అన్నారు. పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో పెద్దపల్లి పార్లమెంట్ స్థాయిలో నిర్వహిస్తున్న కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ పోటీలను గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణతో కలిసి ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. పోటీల ఆర్గనైజర్లు పుల్లూరి కళ్యాణ్, నీలం రాకేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నీలం శ్రీనివాస్‌గౌడ్, పల్లెరాజు, వొడ్నాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.వెయ్యి

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికులకు కనీస పెన్షన్ రూ.వెయ్యి చెల్లించడానికి సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు అంగీకరించిందని బీఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తమ యూనియన్ బొగ్గు గనుల ఇన్‌చార్జి, ట్రస్టీ బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఢిల్లీలో బొగ్గు గనుల శాఖ కార్యదర్శి అమృత్‌లాల్ మీనాను కలిసి చర్చించిన మేరకు బోర్డు అంగీకారం తెలిపిందన్నారు.

ఉద్యోగులు పనితీరు మెరుగు పర్చుకోవాలి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

బెల్లంపల్లి: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి కార్మికులు, ఉద్యోగులు పని తీరు మెరుగు పర్చుకోవాలని మందమర్రి ఏరియా జీఎం, మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ చైర్మన్ ఏ.మనోహర్ సూచించారు. గురువారం శాంతిఖని గనిపై మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి నిబద్ధతతో తమకు కేటాయించిన పనులను నిర్వహించడం వల్ల అనుకున్న లక్ష్యాన్ని చేరడం సులువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం ఎ.రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఎస్‌కే గ్రూప్ ఏజెంట్ విజయప్రసాద్, సీఎంవో ఏఐ వైస్ ప్రెసిడెంట్ నాగవర్ధన్, ఏజీఎం (ఈఅండ్ఎం) ఎం.నాగరాజు, డీజీఎం(ఎఫ్అండ్ఏ) ఆర్‌వీఎస్‌కే ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం (ఐఈడీ) పి.రాజన్న, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిపై దృష్టి


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

భీమారం: కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్ కోరారు. గురువారం జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనివద్ద మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో ఐకే1ఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ శ్రీరాంపూర్ ఏరియా అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శి కొముర‌య్య, శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ విభాగాల అధిపతులు చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ పీ.అరవింద్, డీజీఎం పర్సనల్ చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం లెక్క పక్కాగా..!

- పక్కదారి పట్టకుండా ఎక్సైజ్ శాఖ నిఘా
- ఎత్తు బెల్లం అమ్మకాలపై నిబంధనలు


ఓ దుకాణంలో నిల్వ ఉంచిన బెల్లం

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాల క్రైం: మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలకు మొక్కుల చెల్లింపుల్లో ప్రధానమైన నిలువెత్తు బంగారం (బెల్లం) పక్కదారి పట్టకుండా విక్రయాలపై ఎక్సైజ్ శాఖ నిఘా పటిష్టం చేసింది. వనదేవతల జాతర సందర్భంగా బెల్లం వ్యాపారం రూ.కోట్లలో సాగుతుంది. ఈ నేపథ్యంలో గుడుంబా తయారీకి వినియోగించేందుకు బెల్లం పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నాయి. ఈక్రమంలో ఎక్సైజ్‌శాఖ నిబంధనలు విధించింది. హోల్‌సేల్, రిటైల్‌గా ఎంతమేర బెల్లం విక్రయాలు జరుగుతున్నాయనే దానిపై దృష్టి సారించింది. బెల్లం విక్రయాలు సమ్మక్క–సారలమ్మ మొక్కులకేనా..? లేదా? అనే వివరాల సేకరణలో ఎక్సైజ్‌శాఖ నిమగ్నమైంది. కొనుగోలు చేసిన వివరాలతో తప్పనిసరిగా ప్రతీరోజు విక్రయాల లెక్కపత్రాలు అప్పగించాలని దుకాణదారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో వ్యాపారులు విక్రయాలపై ఎప్పటికప్పుడు పేర్లు, చిరునామా.. తదితర వివరాలు నమోదు చేస్తూ ఎక్సైజ్ శాఖకు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఆధార్ ఉంటేనే ఎత్తు బంగారం ఇవ్వాలనే దానిపై స్పష్టత కొరవడింది.

ఎత్తు బంగారంతో ...

రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతర నేపథ్యంలో బెల్లంకు (బంగారం) డిమాండ్ ఉంటుంది. దీంతో స్థానిక వ్యాపారులు పెద్దఎత్తున బెల్లం దిగుమతి చేసుకున్నారు. మంచిర్యాలలో ఎనిమిది వరకు బెల్లం హోల్‌సేల్ దుకాణాలున్నాయి. ఇప్పటికే మహారాష్ట్రలోని లాతూర్, నాందేడ్ జిల్లాల నుంచి బెల్లం వ్యాపారులు మంచిర్యాలకు బెల్లం దిగుమతి చేసుకున్నారు. మహిళలు మంగళహారతులు చేతబూని బెల్లం దుకాణాల వద్దకు వస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు మొక్కులు అప్పగించే భక్తుడు తూకంలో ఎన్ని కిలోల బరువు ఉంటే అన్ని కిలోల బంగారం (బెల్లం) కొనుగోలు చేసి తీసుకుని వెళ్తున్నారు. జాతర సమీపిస్తుండటంతో బెల్లం దుకాణాల వద్ద భక్తుల సందడి పెరుగుతోంది.

అమావాస్య వెళ్తేగానీ..

గతంతో పోల్చితే ఈ ఏడాది బెల్లం అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కోలారీలో ఒక్కో ముద్ద (పది కిలోలు)చొప్పున ఉండే 1600 ముద్దలు (16 టన్నులు) మంచిర్యాలకు దిగుమతి అయ్యాయి. ఇప్పటికి వరకు పది లారీల మేర బెల్లం దిగుమతి అయినట్లు తెలుస్తోంది. అమావాస్య వెళ్తేగానీ బెల్లం అమ్మకాలకు డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది బెల్లం కిలోకు రూ.36 నుంచి రూ.38 వరకు ధర పలుకుతోంది. చిన్నముద్దలు కిలోకు రూ.46 వరకు ధర పలుకుతున్నాయి. పెద్ద ముద్దలు మొదటికి (మేడారం)కు తీసుకెళ్లడం కష్టమవుతున్న నేపథ్యంలో ఒకటి రెండు చిన్నముద్దలు తీసుకుని బెల్లంకు బదులు చక్కెర తీసుకెళ్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఆధార్ తప్పనిసరి

రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతరకు భక్తులు మొక్కుగా చెల్లించే ఎత్తు బంగారంపై పటిష్ట నిఘా పెట్టాం. ఎప్పటికప్పుడు అమ్మకాల వివరాలు ఇవ్వాలని బెల్లం వ్యాపారులను ఆదేశించాం. ఎత్తు బంగారం తీసుకునే భక్తులు ఆధార్‌కార్డు చూపిస్తేనే బెల్లం ఇవ్వాలని వ్యాపారులకు సూచించాం.

– నందగోపాల్, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి, మంచిర్యాల

బుగ్గ రాజేశ్వర ఆలయంలో వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి జాతరను పురస్కరించుకుని గురువారం వేలం నిర్వహించారు. మార్చి 8 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతరలో తైబజార్, కొబ్బరికాయలు, ప్రసాదాల విక్రయాలు, వాహనాల పార్కింగ్‌కు ఆలయ ఈవో బాపురెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయాలకు రూ.76వేలు, ప్రసాదాలకు రూ.1,46,500, వాహనాల పార్కింగ్‌కు రూ.1,71,000 లకు హక్కులు దక్కించుకున్నారు. తైబజార్ వేలం వాయిదా పడినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి, చాకేపల్లి ఎంపీటీసీ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఒగ్గుకథకు దక్కిన అవకాశం


ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

భీమిని: మండలంలోని వీగాం గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారులకు ఆదిలాబాద్‌లోని ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో ఒగ్గుకథ చెప్పే అవకాశం వచ్చింది. కళాకారులు కర్ర రమేశ్, కర్ర వెంకటేష్, భీరేష్, పోలే హన్మంతు, పోలే బీరయ్య బృందం బుధవారం రేడియో స్టేషన్‌లో మహారాజ ఒగ్గు కథను ప్రదర్శించారు. గతంలో రాష్ట్రస్థాయిలో ఒగ్గుడోలు విన్యాసాలు, ఒగ్గు కథ చెప్పి ప్రముఖుల నుంచి పురస్కారాలు సైతం అందుకున్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి


నైపుణ్య శిక్షణకు హాజరైన మహిళలు

పాతమంచిర్యాల: మహిళలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకట రమణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్నేహ ఇన్ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ప్రొడక్టివిటీ కౌన్సిల్ సభ్యులు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ చదివిన మహిళలకు నైపుణ్య శిక్షణ, స్కిల్‌డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన ఉండాలన్నారు. నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీ కో ఆర్డినేటర్ సత్యం, నిర్వాహకులు యాసిన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి


పంచనామా నిర్వహిస్తున్న సీఐ, ఎస్సై

సిర్పూర్(టి): ఈ నెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం కొటాల మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన కోట ఈశ్వరి (14) సిర్పూర్(టి)లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. నెల రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లో ఉంటోంది. తల్లిదండ్రులు, సోదరి మిర్చి పంట కోయడానికి కూలి పనికోసం ఖమ్మం వెళ్లారు. ఈ క్రమంలో బాలికకు జ్వరం రావడంతో మనస్తాపానికి గురైంది. ఆదివారం పురుగుల మందు తాగడంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లి కోట సీమంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వార్షిక లక్ష్యాన్ని సాధించాలి

- సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అల్విన్


సమావేశంలో పాల్గొన్న ఈడీ అల్విన్

శ్రీరాంపూర్: ఈ ఆర్థిక సంవత్సరం సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను సాధించాలని సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) డాక్టర్ అల్విన్ సూచించారు. గురువారం సీసీసీ లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో బెల్లంపల్లి రీజియన్ జీఎంలతో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి 31 నాటికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను వందశాతం సాధించాలన్నారు. ఉత్పత్తి చేసిన బొగ్గును పూర్తిగా రవాణా చేయాల్సి ఉందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉత్పత్తి లక్ష్యాల కోసం ప్రణాళికలు ముందే సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, మందమర్రి జీఎం, మనోహర్, బెల్లంపల్లి జీఎం రవిప్రసాద్, ఓసీపీల అధికారులు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, మార్కెటింగ్ అండ్ మూమెంట్ డీజీఎం సురేంద్ర రాజు, ఏజెంట్లు గోపాల్ సింగ్, ఏవీ రెడ్డి, రాముడు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాల పనిగంటలు పెరగాలి


డంపర్‌ను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఓసీపీల్లో భారీ యంత్రాల పనిగంటలు మరింత పెరగాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో రూ.4.63 కోట్లతో కొనుగోలు చేసిన మూడు డంపర్లు, షవల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి పురుషోత్తం రెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి మేనేజర్ సుధీర్, అధికారులు చంద్రశేఖర్, శ్యాంసుందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత పెంచాలి


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తితో పాటు నాణ్యత కూడా పెంచాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఆర్కే 5 గనిపై మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకత, లక్ష్యసాధన, బొగ్గు నాణ్యత పెంపు, ఉద్యోగుల సంక్షేమం, తదితర అంశాలపై గనులవారీగా ప్రణాళికలు తయారు చేసుకొని దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. సంస్థ ఆర్థిక స్థితిగతులను ఉద్యోగులకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, ఏజెంట్ గోపాల్ సింగ్, అధికారులు మల్లయ్య, మురళీధర్, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, అమర్‌నాథ్, కాంతారావు, శివయ్య, అనుదీప్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని నందిని రాష్ట్రస్థాయి లాంగ్‌జంప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గఫార్, పీడీ బండ జీవరత్నం గురువారం తెలిపారు. జనవరి 31న నస్పూర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని ప్రథమస్థానంలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. నల్గొండ జిల్లాలోని సూర్యాపేటలో ఈనెల 10న నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ లాంగ్‌జంప్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సీసీఐ జిన్నింగ్ మిల్లులో ఈనెల 10, 11 తేదీలలో పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు సీసీఐ సీపీవో ఉదయ్ షా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం, ఆదివారం రావడంతో రెండు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని, తిరిగి 12న యథావిధిగా కొనుగోళ్లు జరుగుతాయని, రైతులు సహకరించాలని కోరారు.

'సంత్ సేవాలాల్' యువతకు ఆదర్శప్రాయుడు

జన్నారం: లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ నేటి యువతకు ఆదర్శ ప్రాయమని ఆదిలాబాద్ జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. ఈ నెల 18న నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, ఎంపీటీసీ రియాజొద్దీన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్‌అలీఖాన్, నాయకులు మోహన్‌రెడ్డి, రాజశేఖర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నందునాయక్, కార్యదర్శి దినేశ్ నాయక్, సభ్యులు రాములునాయక్, సందేశ్‌నాయక్, ధర్మునాయక్, తదితరులు పాల్గొన్నారు.